
## రాష్ట్ర ప్రజలకు గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు



హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి పర్వదినాల సందర్భంగా ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. పాడిపంటలు, సుఖశాంతులతో ప్రజలు తులతూగాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కాంక్షించారు. పండుగలు మన వారసత్వ ప్రతీకలని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు అత్యంత విలువ ఇచ్చే రాష్ట్ర ప్రజలు నిత్యం సుఖశాంతులతో విలసిల్లాలని ఆయన అభిలషించారు.

### సిరిసంపదలతో తులతూగాలి: ఎంపీ వద్దిరాజు



సంక్రాంతి పండుగ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇల్లు సిరిసంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. బంధుమిత్రులతో కలిసి సంక్రాంతి సంబురాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు.

## మూడు రోజుల్లో ఏపీ వైపు 1.78లక్షల వాహనాలు

- హైదరాబాద్ -విజయవాడ రహదారిపై వాహనాల రద్దీ

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణ వాసులందరూ పల్లెబా ట పట్టారు. దీంతో హైదరాబాద్ నుంచి విజయవాడ, కర్నూలు, తమిళనాడు వెళ్లే దారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతున్నది. చౌటుప్పల్, తుప్రాన్‌పేట, ఆందోల్ మైసమ్మ, పంతంగి టోల్ ప్లాజా తదిత ర ప్రాంతాల వద్ద పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తున్నారు. మూడు రోజుల్లో 11టోల్ గేట్ల ద్వారా ఏపీ వైపు సుమారు 1,78,000 వాహనాలు వెళ్లాయి.

# అమ్మకానికి మదర్ డెయిరీ ఆస్తులు!

➤ మొదటిపేజీ తరువాయి...

యూనియన్ లిమిటెడ్ (మదర్ డెయిరీ) మూడున్నర దశాబ్దాల కాలంగా పాడి ఉత్పత్తిదారులకు ఆసరాగా నిలుస్తున్నది. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 24 చిల్లింగ్ సెంటర్లు, 32 వేల మంది సభ్యులు, 432 సొసైటీల ద్వారా రోజుకు లక్ష లీటర్ల పాల సేకరణ జరుగుతున్నది. 3లక్షల మంది వినియోగదారులకు పాలు, పాల ఆధారిత ఉత్పత్తులను అందిస్తున్నది.

**రూ.60కోట్ల అప్పులు అంటూ..**

మదర్ డెయిరీ 26వ సర్వసభ్య ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ఈ నెల 9న సభ్యులకు నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 2న హయత్‌నగర్‌లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. 'నార్మాక్ యూనియన్ రూ.60కోట్ల వరకు ఆర్థిక భారం ఏర్పడి రోజువారీ కార్యక్రమాలు నిర్వహించేందుకు యూనియన్ స్థిరాస్తులు విక్రయించడానికి చర్చించి నిర్ణయం తీసుకుకోవడానికి..' అని ఎజెండాలో స్పష్టం చేశారు.




**ఉమ్మడి నల్లగొండలో 30.5 ఎకరాల అమ్మకం**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూనియన్ పేరు మీద కొనుగోలు చేసిన భూములను అమ్మాలని స్కెచ్ వేశారు. నల్లగొండ జిల్లాలోని చిట్యాల పరిధిలో 29 ఎకరాలు, మిర్యాలగూడ పరిధిలోని 1.5 ఎకరాల భూమిని విక్రయించాలని ఎజెండాలో పేర్కొన్నారు.

**గతంలో ఒప్పుకోని బీఆర్ఎస్ సర్కారు**

పాడి రైతులకు వరంగా ఉన్న డెయిరీ ఆస్తులను అమ్మేందుకు నాడు కేసీఆర్ ప్రభుత్వం ససేమిరా అంది. గతేడాది సెప్టెంబర్‌లో మదర్ డెయిరీ ఎన్నికల సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు క్యాంపులకు విజయ డెయిరీ మాదిరిగానే మదర్ డెయిరీకి గ్రాంట్లు ఇప్పించి, అప్పులు తీర్చేలా ఆదుకుంటామని ప్రకటించారని సభ్యులు చెబుతున్నారు. లీటరుకు రూ.4 బోనస్ ఇస్తామని చెప్పి పాల రేట్లను తగ్గిస్తూ వచ్చారని వాపోతున్నారు.

**ఆస్తులు విక్రయిస్తే ఉద్యమమే..**



మదర్ డెయిరీ ఆస్తులు అమ్మడానికే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందా? ఎన్నికల సమయంలో మంత్రి కోమటిరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య చెప్పిన గ్రాంట్లు ఏమయ్యాయి..? లీటరుపై నాలుగు రూపాయల బోనస్ ఇవ్వకపోగా రేట్లు తగ్గించడం దారుణం. ఆస్తుల విక్రయం నిర్ణయాన్ని విరమించుకోవాలి. పట్టించుకోకుండా ముందుకు వెళ్తే పెద్దఎత్తున ఉద్యమం చేస్తాం.

**- దొంతిరి సోమిరెడ్డి, మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్**


- హైవేపై కిక్కిరిసిన వాహనాలు



*హైదరాబాద్ – విజయవాడ 65వ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాలు కిక్కిరిసిపోయాయి. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఇరువైపులా 16 టోల్‌బూత్‌లు ఉండగా.. విజయవాడ వైపు 11 బూత్‌లను తెరిచారు. గత సంక్రాతికి 77వేల వాహనాల రికార్డు ఉండగా.. ఇప్పుడు 6వేలు అధికంగా వెళ్లడంతో ఆ రికార్డు బ్రేక్ అయ్యింది. – చౌటుప్పల్*

## రిటైర్మెంట్ సడలింపుపై వీసీల గుర్రు

- రెగ్యులర్ వారికి ఒకలా.. కాంట్రాక్ట్ వారికి మరోలా!
- 60 ఏండ్లు దాటిన కాంట్రాక్ట్ బోధకుల కొనసాగింపు
- రెగ్యులర్ ప్రొఫెసర్లకూ అరవై ఏండ్లకే పదవీ విరమణ
- ఉన్నత విద్యామండలి తీరును వ్యతిరేకిస్తున్న వీసీలు



హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిబంధనలంటే అందరికి సమానం. ఇక రిటైర్మెంట్ విషయంలో ఎవరికీ మినహాయింపేం కాదు. కానీ ఉన్నత విద్యామండలి మాత్రం ఈ విషయాన్ని విస్మరించి నడుచుకుంటున్నది. రెగ్యులర్ వారికి ఒకలా.. కాంట్రాక్ట్ వారికి మరోలా నిబంధనలను అమలుచేయడానికి ప్రయత్నిస్తున్నది. ఒకవైపు రెగ్యులర్ ప్రొఫెసర్లు 60 ఏండ్లకే పదవీ విరమణ పొందుతుండగా, 60 ఏండ్లు దాటిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను తిరిగి కొనసాగించవచ్చని ఆదేశాలిచ్చింది. వర్సిటీలకు మండలి లేఖలు రాసింది. ఇది వివాదాస్పదమైంది. ఈ లేఖపై ఉన్నత విద్యామండలి వర్సెస్ వర్సిటీలు అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇటీవల ఉన్నత మండలి అన్ని వర్సిటీల వీసీలతో నిర్వహించిన సమావేశంలో లేఖ ప్రస్తావన రాగా, ఓయూ, మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ వర్సిటీల వైస్ చాన్స్‌లర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదేం విధానమని, ఎలా కుదురుతుందని మండలి అధికారులను నిలదీసినట్టు తెలిసింది. అటానమస్ హోదా గల వర్సిటీల విషయంలో మండలి జోక్యం తగదని కొందరు వీసీలు అన్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. మండలి కేవలం సూచనలు, సలహాలు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని చెప్పినట్టుగా అధికారుల్లో చర్చలు నడుస్తున్నాయి.

**అవసరముంటేనే తీసుకోవాలని సూచించాం**

వర్సిటీల్లో అవసరముంటే 60 ఏండ్లు దాటిన వారిని తీసుకోవాలని సూచన మాత్రమే చేశాం. అవసరాన్ని బట్టి పరిశీలించమన్నాం. అదేం జీవో కాదు. కేవలం సర్క్యులర్ మాత్రమే. అయినా కొనసాగించాలా.. లేదా అన్నది వీసీల ఇష్టం. తప్పనిసరిగా అమలుచేయాలన్న నింబంధనలేం లేవు.

**- ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి**

## 'సంక్రాంతి' లింక్ క్లిక్‌చేస్తే లూటీ

- ప్రమాదకర మాల్‌వేర్‌తో సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడ
- జాగ్రత్తలు పాటించాలంటున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): 'ఎంజాయ్ సంక్రాంతి స్పెషల్ ఫ్రీ రీచార్జ్.. 4 జీబీ డాటా వ్యాలిడ్ టిల్ యువర్ కరెంట్ ప్యాక్ వ్యాలిడిటీ. ఆల్సో గెట్ 2 జీబీ డాటా ఆన్ యువర్ నెక్స్ట్ రీచార్జ్' అంటూ ఓ సైబర్ మోసగాడి నుంచి ఫేక్ మెసేజ్. 'సంక్రాంతి పండుగ సందర్భంగా మీ నంబర్‌కు బంపర్ ఆఫర్ వచ్చింది. మీకు 10 జీబీ డాటా ఉచితంగా అందించబడుతుంది. దీని కోసం మేము పంపిన లింక్‌ను క్లిక్ చేసి, మీ వివరాలు పొందుపర్చండి. ఆ తర్వాత ఆ మెసేజ్‌ను 10 మందికి పంపితే మీకు పూర్తి ఉచితంగా 10 జీబీ డాటా లభిస్తుంది' అంటూ మరో కేటుగాడి మెసేజ్. ఇలా.. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో ప్రకటనలు, మెసేజ్‌లతో అమాయకులకు వల వేసి డబ్బులు లూటీ చేస్తున్నారు. దీనిపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో అప్రమత్తమైంది.ఇలాంటి ప్రకటనలకు ఎవరూ ఆశపడొద్దని, లింకులను క్లిక్ చెయ్యొద్దని సూచిస్తున్నది.

## నా కుమారుడికి గుర్తింపు ఇవ్వలేదు

**ఓపెన్ ఏఐపై సుచిర్ బాలాజీ తల్లి ఆరోపణ • మరణంపై ఎఫ్‌బీఐ విచారణకు డిమాండ్**

న్యూఢిల్లీ, జనవరి 12: చాట్‌జీపీటీ అభివృద్ధిలో తన కుమారుడు ఎంతో కృషి చేసినప్పటికీ ఓపెన్‌ఏఐ సంస్థ మాత్రం తగిన గుర్తింపు ఇవ్వలేదని సుచిర్ బాలాజీ తల్లి అపర్ణారావు ఆరోపించారు. చాట్‌జీపీటీని అభివృద్ధి చేసిన ఓపెన్‌ఏఐలో సుచిర్ బాలాజీ నాలుగేండ్లు పని చేసి 2023 ఆగస్టులో రాజీనామా చేశారు. ఆ తర్వాత ఓపెన్‌ఏఐ అనైతిక చర్యలకు పాల్పడుతున్నదని ఆయన ఆరోపించి, పలు ఆధారాలను బయటపెట్టారు. ఈ క్రమంలో గత నవంబర్‌లో శాన్ ఫ్రాన్సిస్కోలోని తన అపార్ట్‌మెంట్‌లో సుచిర్ బాలాజీ అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ విషయమై ఆయన తల్లి అపర్ణారావు మారియా నాఫల్ అనే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌తో మాట్లాడుతూ..'చాట్‌జీపీటీని వేగంగా, సమర్థంగా అభివృద్ధి చేయడానికి నా కొడుకు తోడ్పడ్డాడు. కానీ తను మరణించే వరకు తన పనికి గుర్తింపు దక్కలేదనే బాధ అతడిలో ఉండేది. ఇప్పుడు కూడా సుచిర్ సేవలకు ఓపెన్‌ఏఐ తగిన గుర్తింపు ఇవ్వకపోవడం దురదృష్టకరం' అని ఆమె పేర్కొన్నారు. తమ కుమారుడి మరణం ఆత్మహత్యలా లేదని, అసలు నిజాన్ని తేల్చడానికి ఎఫ్‌బీఐ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు.

## సంక్రాంతి స్పెషల్ బాదుడు

- ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్న ఆర్టీసీ
- జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.240, నిర్మల్‌కు 650




*ఆదివారం జేబీఎస్ నుంచి మెదక్‌కు ఇద్దరికి ఇచ్చిన టికెట్ ధర*

మెదక్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ వేళ ప్రయాణికులపైన స్పెషల్ పేరిట ఆర్థిక భారం మోపుతున్నది రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ (టీజీఎస్ఆర్టీసీ). పండుగకోసం స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్నది. స్పెషల్ బస్సుల పేరిట బోర్డులు తగిలించి ముక్కుపిండి అధిక చార్జీలు వసూలు చేస్తున్నది. మహిళలకు ఉచిత ప్రయాణానికి అవసరమైన మేరకు బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధిక చార్జీలు పెట్టి కూడా దూర ప్రాంతాలకు నిలబడి పోవాల్సి వస్తున్నదని పురుష ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిర్మల్, మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్‌తో పాటు నిజామాబాద్ జిల్లా బాన్సువాడ, బోధన్, ఎల్లారెడ్డి నుంచి నడిపిస్తున్న కొన్ని బస్సులకు దూర ప్రాంతాల బోర్డులు వేసి స్పెషల్ పేరుతో అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల నుంచే తమకు ఆదేశాలు ఉన్నాయంటూ దబాయిస్తున్నారు. ఆదివారం జేబీఎస్ నుంచి మెదక్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో డ్రైవర్‌తో ప్రయాణికులు ఘర్షణకు దిగారు. మెదక్ డిపో నుంచి సంక్రాంతి స్పెషల్‌గా ఎక్స్‌ప్రెస్ బోర్డుతో వచ్చిన టీఎస్ 35 జడ్ 0022 బస్సు ఉదయం 7:30 గంటలకు జేబీఎస్‌కు చేరుకుంది. జేబీఎస్‌లో ఆ బస్సు ఎక్కిన ప్రయాణికులతో డ్రైవర్ టికెట్ ఇచ్చి అధికంగా వసూలు చేశాడు. జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.160 చార్జి కాగా, అదనంగా రూ.80 వసూలు చేసి రూ.240 టికెట్ ఇచ్చాడు. అక్కడే ఉన్న మెదక్ డిపో మేనేజర్‌ను ఇదేమిటని అడుగగా, సంక్రాంతి పండుగ సందర్భంగా స్పెషల్ పేరిట చార్జీలు వసూలు చేస్తున్నామని సమాధానమిచ్చారు. జేబీఎస్ నుంచి నిర్మల్‌కు 650 వసూలు చేశారు.



*జగన్‌తండాలో రాజ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న వినయ్‌భాస్కర్*

## మీడియా గొంతు నొక్కడం అవివేకం

*రాజ్‌కుమార్‌కు అండగా ఉంటాం*
*మాజీ విప్ దాస్యం వినయభాస్కర్*

వర్ధన్నపేట, జనవరి 12 : ప్రజా సమస్యలను వెలికితీసే మీడియా గొంతు నొక్కుతూ పాలన కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడం అప్రజాస్వామికమని మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. యూట్యూబ్ వేదికగా పనిచేస్తున్న ఆర్‌జీ టీవీ ప్రతినిధి, గిరిజన బిడ్డ రాజ్‌కుమార్ జనగామ జైలు నుంచి తన స్వగ్రామమైన మండలంలోని జగన్‌తండాకు వచ్చిన విషయం తెలుసుకొని రాజ్‌కుమార్‌ను బీఆర్ఎస్ నాయకులతో వినయ్‌భాస్కర్ కలిసి మనోధైర్యం కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీడియా ప్రతినిధి రాజ్‌కుమార్‌ను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేసి, జనగామ జైలులో వేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, ప్రజా ఇబ్బందికర పరిస్థితులను ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల అభిప్రాయాలను యూట్యూబ్ వేదికగా బహిర్గతం చేస్తున్న రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేయడం పిరికిపంద చర్య అన్నారు. అక్రమంగా అరెస్టు చేసినంత మాత్రాన ప్రజలు, మీడియా ఊరుకోదన్నారు. ఇలాంటి మీడియా ప్రతినిధులకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. త్వరలోనే అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రజల తరపున నిలిచే ప్రతి ఒక్కరికి బీఆర్ఎస్ మద్దతు ఉంటుందని వినయభాస్కర్ అన్నారు. ఆయన వెంట వర్ధన్నపేట మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, హనుమకొండ జిల్లా నాయకులు ఉన్నారు.

## భూ విక్రయంలో కాంగ్రెస్ నాయకురాలి జోక్యం

*మక్కజొన్న చేనుపై విష ప్రయోగం చేశారని బాధితుల ఫిర్యాదు*

గీసుగొండ, జనవరి 12 : గీసుగొండ మండలంలోని ఎలుకుర్తి గ్రామంలో భూ విక్రయంలో కాంగ్రెస్ నాయకురాలి జోక్యంతో రైతుకు కష్టాలు మొదలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తిప్పరపు కిరణ్ తన తల్లి వీరాబాయి పేరుతో 2017లో ఎకరానికి రూ. 8లక్షలకు అల్లూరి ప్రేమలీల నుంచి రెండెకరాల భూమిని కొనుగోలు చేశాడు. అందుకు రూ 7,11,000 చెల్లించాడు. ఆ తర్వాత భూమి రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో 2024లో పెద్దమనుషుల సమక్షంతో పంచాయితీ నిర్వహించారు. ఈ క్రమంలో భూముల విలువ పెరిగిందని, డబ్బుల చెల్లింపు విషయంలో ఆలస్య మైనందుకు ఒక ఎకరానికి గతంలో చెల్లించిన ధర సరిపోతుందని, మరో ఎకరానికి రూ. 30 లక్షలు చెల్లించాలని కాంగ్రెస్ నాయకురాలి ప్రోద్బలంతో ప్రేమలీల డిమాండ్ చేసింది. దానికి బాధితులు ఒప్పుకొని నాయకురాలికి అడ్వాన్స్‌గా రూ. 5 లక్షలు చెల్లించారు. సదరు నేత డబ్బులు ఇవ్వడం ఇష్టంలేక ఈ విషయాన్ని జఠిలం చేసింది. ఈక్రమంలో గతేడాది డిసెంబ ర్ 12న ప్రేమలీలతో పాటు ఐదుగురు వ్యక్తులు బాధితుడు సాగు చేసిన మక్కజొన్న చేనును పాక్షికంగా ధ్వంసం చేశారు. బాధితులు అదే రోజు గీసుగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 4న చేనులో గుర్తు తెలియని మందు స్ప్రే చేయడంతో మరో సారి బాధితులు గీసుగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మందు ప్రభావంతో మక్క జొన్న పంట ఎర్రబారుతూ కుంగిపోతున్నది. తమకు పంట నష్టంతో రూ. 2లక్షల నష్టం వా టిల్లిందని బాధితులు ఆదివారం విలేకర్లకు తమ గోడును వినిపించారు. చేతికి అందే సమ యంలో పంట ను పాడు చేసిన ప్రేమలీలతో పాటు రాజేశ్వరి, రమేశ్, తిరుపతి, రాజశేఖర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితులు కోరారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రతి పేదవాడికి లబ్ధి చేకూరాలి
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



*మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మంత్రులు సురేఖ, సీతక్క తదితరులు*

హనుమకొండ, జనవరి 12: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి తారతమ్యాలు లేకుండా ప్రతి పేదవాడికి లబ్ధి చేకూరేలా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రూనాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కేఆర్ నాగరాజు, తెల్లం వెంకట్రావు, ఉమ్మడి జిల్లా హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ వినయ్ కృష్ణారెడ్డిలతో కలిసి సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదోడి కలను నెరవేర్చాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదన్నారు. జనవరి 26వ తేదీ నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలు పంపిణీ కాబోతున్నాయని తెలిపారు. ఆర్థికపరమైన ఇబ్బందులున్నప్పటికీ రైతు భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎకరానికి రూ. 12 వేల అందించనుందని అన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సభ పెట్టి నాలుగు పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తారని తెలిపారు. అధికారులు పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడంలో కలెక్టర్లు కృషి చేయాలని, ప్రతి గ్రామంలో ఒకరోజు గ్రామసభ నిర్వహించాలన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం ముందుకు వెళ్తున్నదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఆయా జిల్లాల్లో కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీల సమన్వయంతో అమలు చేయాలన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. సమావేశంలో కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, షేక్ రిజ్వాన్ బాషా, దివాకర, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, ఐటీడీఏ పీవో మిశ్రా, ఆరు జిల్లాల అదనపు కలెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అడవులతోనే మానవ మనుగడ




*బర్డ్‌వాక్‌లో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు, ఫొటోగ్రాఫర్లు తదితరులు*

ఖానాపురం, జనవరి 12: అడవులతోనే మానవ మనుగడ సాధ్యమని విశ్రాంత డీఎఫ్‌వో పురుషోత్తం అన్నారు.ఈ మేరకు ఆదివారం పాకాల అడవుల్లో అటవీశాఖ, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ, యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో బర్డ్‌వాక్ నిర్వహించారు. ఫొటోగ్రాఫర్లు, విశ్రాంత ఉద్యోగుల, నిట్ ప్రొఫెసర్లు, చిన్నారులు 30 మంది కలిసి ఉదయం 6 గంటల నుండి పాకాల అడవుల్లో 6 కిలోమీటర్ల మేర బర్డ్‌వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వివిధ రకాల పక్షులను, జంతువులను ప్రత్యక్షండి వీక్షించారు. అనంతరం పాకాల సరస్సులో బోటింగ్ చేశారు. కార్యక్ర మంలో డీఆర్వో రీనా, నాగేశ్వర్‌రావు, శ్యాంసుందర్, ఉప్పలయ్య, రవి, సారయ్య, ఆరీఫ్ అలీ, పవన్‌కుమార్, రాజ్‌మోహన్ పాల్గొన్నారు.

# నేతన్నల రుణమాఫీ ఎప్పుడు?

### అమలు కాని సీఎం హామీ

పోచమ్మమైదాన్, జనవరి 12: చేనేత కార్మికుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో అమలు చేసిన మూడు పథకాలకు కాంగ్రెస్ సర్కారు పేర్లు మార్చుతూ తిరిగి అమలు చేస్తున్నట్లు ప్రకటిం చినప్పటికీ నేతన్నలు సంతృప్తి చెందడం లేదు. గతేడాది ఆగస్టు 7న చేనేత దినోత్సవం సంద ర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేతన్నకు రుణమాఫీ అమలు కాకపోవడంతో నిరుత్సాహ పడుతున్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు మాఫీ వస్తుందని ఆశించినా నిరాశే ఎదురైంది.



**హామీ బుట్టదాఖలు**

ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో ఆడంబరంగా సమావేశం ఏర్పాటు చేసి నేత కార్మికులను బస్సు ల్లో తరలించారు. ఈ సందర్భంగా రైతులకు మాదిరిగా నేతన్నలకు కూడా రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీని కోసం రూ.30 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో అధికారులు రుణమాఫీ విషయంలో లెక్కలు తేల్చగా రూ.57 కోట్ల పైఉన్నట్లు ఆర్థిక శాఖ కు ప్రతిపాదనలు పంపారు. అయితే ఇంతవరకు రుణమాఫీపై ఎలాంటి ప్రకటన చేయలేదు. రుణాలు మాఫీ అయితే తాము ఆర్థికంగా నిలదొక్కుకుంటామని ఆశిస్తే నిరాశే మిగిలిందని, దీనిపై కాంగ్రెస్ సర్కారు వైఖరి ప్రకటించాలని చేనేత కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వీలైనంత త్వరలో చేనేత సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు కొలిక్కి రాకపోవడంతో చేనేత సంఘాల్లో ఇంకా పర్సన్ ఇన్‌చార్జిల పాలనే కొనసాగుతున్నది.

## నీటితొట్టిలో పడి బాలుడి మృతి..

*సంక్రాంతి పండుగ వేళ విషాదం*




*రిదాన్ష్(ఫైల్)*

సంగెం, జనవరి 12 : సంక్రాంతి పండుగకు పుట్టింటికి పిల్లలతో వచ్చిన తల్లి కడుపుకోతకు గురైంది. కుమారుడు నీటి తొట్టిలో పడి మృత్యువాతపడడంతో విషాదం చోటుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తికి చెందిన నీరటి రాజు కుటుంబ సభ్యులు సంక్రాంతి పండుగకు అత్తగారి ఊరైన వరంగల్ జిల్లా సంగెం మండలం ఆశాలపల్లికి ఈ నెల 11న వచ్చారు. ఆదివారం అందరూ పండుగ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో రాజు కుమారుడు రిదాన్ష్(3) ఆడుకుంటూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత బాలుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా ఎక్కడా కనిపించలేదు. చివరికి ఇంటి ఆవరణలో ఉన్న నీటితొట్టిని పరిశీలించగా అందులో రిదాన్ష్ కనిపించాడు. వెంటనే బాలుడిని వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించగా, వైద్యపరీక్షలు చేసిన డాక్టర్లు రిదాన్ష్ మృతిచెందినట్టు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైనరేశ్ తెలిపారు.

## జనగామలో యువకుడి హత్య

**పోలీసుల అదుపులో అనుమానితులు**



*వెంకన్న(ఫైల్)*

జనగామ చౌరస్తా, జనవరి 12 : జనగామలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. జిల్లా కేంద్రంలోని వినాయక బార్ అండ్ రెస్టారెంట్ వెనకాల ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో ఆదివారం ఉదయం 8గంటలకు మృతదేహం లభ్యమైంది. స్థానిక రైల్వేస్టేషన్‌లో కోతులతో భిక్షాటన చేస్తూ, రైలు కిందపడి చనిపోయిన వారి మృతదేహాలను ట్రాక్‌లో నుంచి బయటకి తీస్తూ జీవనం సాగించే వెంకన్న (35)గా అర్బన్ పోలీసులు గుర్తించారు. మృతుడి ముఖం, తలపై తీవ్ర గాయాలు ఉండగా, ఒంటిపై నిప్పంటించి ఉంది. మృతుడిది మహబూబాబాద్ జిల్లా. 15ఏళ్ల క్రితం నుంచి జనగామ రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తూ బతుకుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి కుటుంబ సభ్యులు ఎవరూ లేరని, ఒక చెల్లి కొత్తగూడెంలో ఉంటున్నట్లు తెలియగా సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. ఘటన స్థలాన్ని వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తోపాటు ఏఎస్పీ చేతన్ నితిన్ పరిశీలించారు. జనగామ అర్బన్ పీఎస్ ఇన్‌చార్జి (నర్మెట) సీఐ అబ్బయ్య జరిగిన ఘటనపై కేసు నమోదు చేయగా, ఎస్సైలు రాజేశ్‌కుమార్, చెన్నకేశవులు దర్యాప్తు చేస్తున్నారు.

***డబ్బు ల కోసమా..? లేక మరేదైనా కారణమా..?***

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. శనివారం రాత్రి మృతుడు వెంకన్నతోపాటు ధర్మకంచ, సంజయ్‌నగర్ ఏరియాకు చెందిన మరో ముగ్గురు యువకులు కలిసి వినాయకబార్‌లో మద్యం సేవించినట్లు సమాచారం. అర్ధరాత్రి బార్ వెనకాల ఉన్న నిర్మానుష్య ప్రదేశంలోకి నలుగురు వెళ్లిన తర్వాత వీరి మధ్య డబ్బులో, మద్యమో లేక గంజాయి కోసమో ఘర్ష ణ జరిగింది. అది తీవ్రస్థాయికి చేరడంతో మిగతా ముగ్గురు కలిసి వెంకన్న ముఖం, తలపై బండరాయితో కొట్టి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పటించి చంపినట్లు ప్రచారంలో ఉంది. హత్యకు కారకులుగా భావించిన ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## గుండెపోటుతో కళాకారుడు మృతి



*మల్లూర్(ఫైల్)*

నర్సంపేట, జనవరి 12 : మండలంలోని లక్నేపల్లి గ్రామంలో ఆదివారం గుండెపోటుతో కళాకారుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. లక్నేపల్లి బుడిగ జంగాలకాలనీకి చెందిన కళాకారుడు పస్తం మల్లూర్(70) ఊళ్లల్లో పటం సాయం తో కథలు చెబుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివా రం పాకాల కొత్తగూడలో కథ చెబుతుండగా ఛాతీనొప్పి వచ్చింది. తోటి కళాకారులు పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే మ ల్లూర్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి కూడా ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అతడికి ఐదుగురు కుమారులు ఉన్నారు. కాగా, కళాకారుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.